తగిలిన వేలికే తగులుతుంది

(మొదటిభాగం)

వేలాల సుబ్బారావుగారు, బి. ఏ.,

“కొన్నికొన్నిచోట్ల జవాబుదారీ గల అధికారులు కొందరు తమయధికారాన్ని దుర్వినియోగంజేసి దొరతనమువారికిగూడా అపకీర్తి గలిగిస్తూ ఉంటారు. అట్టివారిని కఠినదండనలకు లోను జేయక పోయినయెడల లోకులకు సర్కారుపైగల విశ్వాసము, సదభిప్రాయము తప్పుట సహజము. ప్రస్తుతపుకేసుకు సంబంధించిన ఈదోషి ఒకజవాబుదారీగల పోలీసు సార్జెంటుపదమున ఉండియు తనకర్తవ్యమును పాలింపక పోవుటే కాక తన కెంతమాత్రము సంబంధము లేని యొకవ్యవహారంలో జోక్యం కలిగించుకొని చివరకు రెండుప్రాణాలకు అపాయకారకుడైనాడు. ఆప్రాణాలను దీయవలెనని ఇతనిఅభిప్రాయం కాకపోవచ్చు. కాని ఇతడు జేసిన అవివేకపు పనివలననే వాటిరెంటికి నష్టం కలిగింది. స్వకర్తవ్యచ్యుతుడై ఇట్టినేరం జేసినందులకుగాను ఇతనికి రెండుసంవత్సరాలు కఠినశిక్ష విధింపబడమైనది. ఇతనిబుద్ధిహీనతవల్ల గలిగిన అనర్థానికి ప్రతిఫలంగా ఇతడే శిక్షను అనుభవింపవలసింది కాని ఇతరులు కారు. కాబట్టి ఇతడు చెరసాలలో ఉన్నంతకాలం ఇతనికుటుంబనిర్వాహార్థం ఏదో కొంత సహాయం చేయుటకుగాను దొరతనమువారికి సిఫార్సుచేస్తున్నాను.”

అని జిల్లా మేజస్ట్రీటుగారితీర్మానంలోని అంతిమ వాక్యాలను వినంగానే నాకు అపరిమితానందం అయిపోయింది. తాత్కాలికంగా ధర్మానికి అపజయం కలిగినప్పటికి చిట్టచివర కదే గెలుస్తుందని నిశ్చయపరచుకొన్నాను. న్యాయస్వరూపుడైన పరమాత్మ అత్యాచారాన్ని ఎంతకాలమని సహింపకలడు? అని అనుకొన్నాను. పోలీసుసార్జెం టేమిటి? అధికారదుర్వినియోగం ఏమిటి? జిల్లా మేజస్ట్రీ టేమిటి? ఈతీర్మానం ఏమిటి? ధర్మాధర్మాల జయాపజయా లేమిటి?—అంటారా? వినండి చెబుతాను.

౧

బెజవాడా-గుంతకల్లు రైల్వేలైనుమీద వినుకొండ, దొనకొండస్టేషన్లమధ్య కురిచేడు అనేస్టేషన్ ఉంది. ఉత్తరాది ఇలాకాలనుంచి శ్రీశైలానికి యాత్రీకులనేకులు ఇక్కణ్ణుంచికూడా దిగిపోతూవుంటారు. ఈ స్టేషన్‌కు ఎదురుగా సుమారు నాలుగుమైళ్లదూరంలో చిన్నకొండలవరుస తూర్పుపడమరలుగా వ్యాపించివుంది. ఈవరసలోని కొండలన్నీ చిట్టడవులతో నిండి వర్షాకాలంలో, ముఖ్యంగా ప్రాతఃసాయంకాలములందు—ఆకాశం లంబమానవర్షణోన్ముఖమేఘాక్రాంతమై ఉన్నపుడు—చూడడానికి మిక్కిలి సుందరంగా ఉంటాయి. స్టేషనుకు సూటిగా ఎదురుగా వున్నకొండను డొంకమార్గాన్నే ఎక్కి అవతలి వేపు దిగి మరినాలుగుమైళ్లు నడిచి పోయినామంటే గుండ్లకమ్మ అనేచిన్ననది అడ్డంగా వస్తుంది. దీన్ని దాటి అవతలిఒడ్డు ఎక్కంగానే తగులుతుంది ముడివేముల అనే ఒకచిన్నగ్రామం. ఈగ్రామపుపరిసరాలే ఈకథాప్రసక్తమభాగానికి రంగస్థలాలు. గ్రామానికి పడమట మైలు-ముప్పాతిక మైలు దూరంలో గ్రామజీవనాని కంతా ముఖ్యాధారమైన ఒక సాధారణపు చెరువు వుంది. ఆవూరికీ చెరువుకూ మధ్య ఉండే మైదానమంతా ఆచెరువునీటివల్ల సాగయ్యే పల్లపుపొలాలే. చెరువు సరిగా రెండుపర్యాయాలు నిండిందా అంటే ఒకకారు రాగిపంట నిరభ్యంతరంగా పండుతుంది. ఇటువేపు రాగి, జొన్న, సజ్జ గ్రామీణుల ముఖ్యాహారం. వీటినే చెరువులక్రిందా, వాగులఒడ్డున వున్న పొలాల్లో వేసుకొంటూవుంటారు సాధారణపు చెరువుల్లోని నీరు వరిపంటకు చాలదు. ఈగ్రామంలో గుండా వచ్చిన డొంకబాటొకటి చెరువుకిందిపొలాలకు దక్షిణపశ్చిమంగా బ్రాకి చెరువుకు ప్రక్కగుండా అక్కడికి రమారమి అయిదారుమైళ్లదూరంలో వున్న త్రిపు

రాంతక మనే మరొక గ్రామానికి పోతుంది. ఇటువేపు శ్రీశైలయాత్రీకులకు తగిలే పెద్దగ్రామాల్లో త్రిపురాంతకంగూడా వకటి. ఇక్కడా ఒక పెద్దచెరువు దాన్ని ఆనుకొని ఒకప్రక్క త్రిపురాంతకేశ్వరుని ఆలయం మొదలైనవి ఉన్నాయి. తైర్థికులు తటాకజలావగాహన మాడి మహాదేవుని దర్శించుకొని పోతూవుంటారు. అది కాక ఇటువేపుల కంతా ఒకమాదిరిగ్రామం అవడంవల్ల సర్కారునౌకర్లు వచ్చినా అక్కడే మకాంవేస్తూ వుంటారు.

ముడివేముల ఒక క్షుద్రగ్రామం. ఈ విశేషణం దీనికి ఒక్కదానికే కాదు సుమండీ! ఈ ప్రాంతంలో వున్న గ్రామాల కన్నిటికీ అన్వయిస్తుంది. అన్నింటికీ అంటే మళ్లీ ఎన్నో గ్రామా లున్నాయనికూడా అనుకోవద్దు. ప్రతియేడూ పంట పండుతుందనే నిశ్చయం లేక పోవడంచేత ఇటువేపు జనులే తక్కువ. జనులనుబట్టే గ్రామాలూనూ. నేలలు సారవంతమైనవే కాని ఏంలాభం? వానలు పూజ్యం. నదులనూ వాగులనూ బంధించి కాలువలను తీయించడానికి భూమి సమమైంది కాదు. చిట్టడవులు, తిప్పలు, కొండలు, ఎగుడుదిగుడు నేలలు, నడుమ నడుమ కొండవాగులు. ఒక్క ఇరవై మైళ్లకాల్వ వేయించాలంటే ఎన్ని వియాడక్టుల, ఎన్ని ఎక్విడక్టుల కట్టించాలో తెలియదు. కనీసపక్షం మైలు కొక అక్విడక్టో లేక వియాడక్టో లేక రెండింటినో కట్టించి తీరాలి. ఇక లాకులకు లెక్క ఉండదు. ఎన్నికొండలు తొలిచి సొరంగాలను నిర్మించాలో తెలియదు. ఇక కాల్వ త్రవ్వడానికి నేలయొక్క స్వభావం చూస్తామా అంటే రాళ్లమయం. రాళ్లంటే ఇన్నీ అన్నీ అని కాదు. అనంతాలు. పలుగురాళ్లు, సుద్దరాళ్లు, గులకరాళ్లు, మరసరాళ్లు, నల్లరాళ్లు, నాపరాళ్లు, సుంద్రాళ్లు, ఓ, రాళ్లే రాళ్లు—నేలపైన రాళ్లు, దున్నితే రాళ్లు, త్రవ్వితే రాళ్లు. అడవులన్నీ రాళ్లు, కొండలన్నీ రాళ్లు, వాగులన్నీ రాళ్లు, డొంకలన్నీ రాళ్లు, వంకలన్నీ రాళ్లు—నేల అడుగడుగునా రాళ్లను ఈనుతుందా అనిపిస్తుంది. దైవానుగ్రహంవల్ల కావలసినవర్షం కుర్సిందా అంటె చాలు, ఈరాళ్లలోనుంచే పెకలించుకొని మొలుచుకొస్తాయి మరకతాలవంటి నానావిధవనస్పతులూ, పచ్చనిపైర్లూ, ప్రశస్తమైనశాకాలూనూ. కాని ఒకొక్కమారు ఏళ్లపర్యంతం ఎగేస్తుంటాయి వానలు. రావణుడు తన చెల్లెలు చుప్పనాతికి పసుపుకుంకుమక్రింద ఇచ్చాడని అంటూఉంటారు పెద్దలందరూ ఈ ప్రాంతాలనీ. రాక్షసులరాజ్యకాలంలో యజ్ఞయాగాదులు లేకపోయినప్పటికీ రావణుడిభయంచేత ఏమైనా కురిపిస్తూ వచ్చాడేమో వర్షాలను కాని ప్రస్తుతం ఆంగ్లేయుల రాజ్యకాలంలో ఆలాటిభయ మేమీ లేకపోబట్టి కాబోలు ఇంద్రభగవానుడు అటువైపు మొగమైనా చూపించడు కొన్నిఏళ్లపర్యంతం ఇప్పుడు. ఏకారణమైనా కానీండి! అక్కడివాళ్ల తలరాత అనండి! వర్షత్రయానా వృష్టి దేశాన్నంతటినీ భస్మీభూతం చేసి, జనులందరినీ గగ్గోలుపరచి, తహతహ లాడించి, ఏడ్పించి, నిర్భాగ్యుల ననేకులను అకాలంలోనే పరలోకసన్మానస్వాగతాలకు అభ్యాగతుల గావించింది. చిట్టచివరకు బ్రదికున్నవారి పుణ్యప్రతాపాన్ని నాలుగోఏడు కుంభవర్షం కురిసి నదులు వాగులు పొంగిపోయినాయి. చెరువులు కుంటలు ఏకమైనాయి. వట్టిపోయిన బావులు జలమయమైపోయినాయి. యమునిదగ్గరనుండి వచ్చిన బలవంతపు ఆహ్వానాలను తప్పించుకోలేక స్వీకరించి ప్రయాణాలకు సిద్ధంగావున్న దౌర్భాగ్యులందరూ తాము దీసికొన్న ప్యాసుపోర్టులను ఆప్రవాహాల్లో కలిపారు. ఏప్రకారంగానో అష్టకష్టాలుపడి చెరువుక్రింది పొలాలన్నింటిని దున్ని బాగుచేసికొని రాగిపైరు వేశారు. రెండునెల్లకు పైగా గడిచిపోయింది. మూడేండ్లపర్యంతం భూమి బీడుపడివుండడంచేత కాబోలు పైరు నవనవలాడుతూ మహాజబురుగా ఎక్కివచ్చింది. గుబురులుగా పెరిగిన దుబ్బుమొక్కలే కాని ఒంటిమొక్క చాలా తక్కువ. ఎటు జూచినా మోకాలిబంటి పచ్చనిపైరుగాల్లో లహలహలాడుతూ తరంగాలు కల్పిస్తూ ఊగుతూవుంది. పిల్లలూ, పెద్దలు, యువతీయువకులు, వీళ్లువాళ్లేమిటి, పొలాల్లో పనిపాటలు వున్నవాళ్లంతా చెరువుక్రిందికి వెళ్లారు. సాయంకాలం నాలుగుగంటలు దాటి ఉండవచ్చును. పడమట మబ్బు పట్టి ఉండడం

చేత ఎండ చల్లబడింది. రండి, మనంకూడా ఒకమారీ చెరువుగట్టుమీదికి వెళ్లి వద్దాం.

అదుగో! కోకంచులకు ముళ్లు పెట్టి కట్టిన పొడుగుపాటిజోలెసంచులు వీపులమీదా, ప్రక్కలగుండా వ్రేలాడుతూవుంటే వంగి కొందరును, వెనుక నేలమీద ఈడ్చుకొంటూ కొందరునూ, కూచొని కొందరును కృషకవనితలు తమతమ పొలాల్లో, మళ్లగట్లమీదా కలుపుగడ్డిని దీసి ఒళ్లను నింపుకొంటూ ఉన్నారు. వహవ్వా! ఈకాపుపిల్ల యెంతవయ్యారంగా వంగి గడ్డి కోస్తూందో! అదిగో ఆఅమ్మాయి ఏవో కూనరాగాలు తీస్తూ గడ్డిని దోకి ఝాడిస్తూఉంది. అదో! పారలు చేత పుచ్చుకొని మళ్లకు నీళ్లు కడుతున్నారు—ఆ కృషకులు. అబ్బా! వీళ్లనోటివెంట శుద్ధసంస్కృతంతప్ప వేరేవిధమైన భాష రాదే. ముద్దుకు గాని, మురిపానికి గాని, ఎగతాళికి గాని, నవ్వులాటకు గాని మోటుమాట లేకుండా వీరు మాటాడనే లేరు. అందులోనూ ఎంత గాఢమైన ప్రేమను, ఎంత ఎక్కువసరసాన్ని చూపించాలో అంత ఎక్కువ మోటువాక్యాలనుగూడా ఉపయోగించాలి. ఉప్పులేని చప్పని కూరలాగు మోటుమాట లేనివాక్యం వీరికి రుచింపనే రుచింపదు...నడుస్తూవుండండి. ఆగడం ఎందుకూ మధ్య మధ్య. అదుగో ఆప్రక్కన బీళ్లలో పశువులు మహాఆప్యాయనంగా మేస్తున్నాయి. వాటిని కాయడానికి వచ్చిన ఈపిల్లకాయలు వాటిధ్యానమైనా లేక మరోవేపు బిళ్లంగోడాటలో కేలింతలుకొడుతున్నారు. అది కనిపట్టి ఒకదొంగకోడె మళ్లోకి జారాలినని మెల్ల మెల్లగా తారట్లాడుతూవుంది. ఇదో! ఈవేపు చూశారూ! ఈఆవు ముద్దులు మూటకడుతో ఎంతముచ్చటగా వుందో! మెళ్లో గంట, గజ్జెలమాల! వంటెనిండా పసుపు, మొహాన కుంకం. సాక్షాత్తు నందిని లాగున్నది. ఆకుర్రవా డెవరో దాని దగ్గర. వాడే బిళ్లగోడాటలో పాలుగొనక ఆవు మెడను రాస్తూ కూర్చున్నాడు. అది మహానందంతో నెమరువేస్తూంది. సంతృప్తి, సంతోషాలు మూర్తీభవించినలాగుంది దానిమొహం చూస్తే......కాస్తంత నిలవండి...

ఎవరబ్బా! వీళ్లు... మనవెనుకాల మన మెచ్చిన బాటవెంటే ఇంతమంది పెద్దగుంపుగా వస్తున్నారూ.......

ఊహూఁ! తెలిసింది తెల్సింది. ఎవరో అనుకొన్నా. మన తహశీల్ దొరే. వెంట మామూలు సిబ్బందిని పెట్టుకొని వస్తున్నారు. ఇద్దరు పోలీసుజవాన్లు, ఇద్దరు బిళ్లబంట్రోతులు, మునసబుకరణాలు, మరికొందరు మహాజనులు, త్రిపురాంతకపు పోలీసుసార్జెంటు—ఇత్యాదు లున్నట్టున్నారు.

అదుగో! మననందిని దగ్గరకు వచ్చి ఆగారు. ఏదో ప్రసంగిస్తూఉన్నారు. వినండి! సావధానంగా...

తహ—కరణంగారూ! లోకమంతా ఒక విచిత్రం—అందులో జరిగేవన్నీ అంతకంటే విచిత్రాలూ.

కర—చిత్తం! సెలవియ్యండి!

తహ—ఏముందీ! ఏవస్తువుకోసం మనం ప్రాధేయపడి ఎప్పుడు వెదుకుతామో అప్పుడావస్తువు దొరకదు.

కర—చిత్తం. అంతేనండి!

తహ—వెయ్యిప్రయత్నాలు చేసినా సరే అవన్నీ వ్యర్థమౌతాయి.

కర—చిత్తం! ప్రాప్తి లేకుంటే అంతేనండి.

తహ—కాని...అదే వస్తువు ఒకొక్కప్పుడు—ఆసమయవిశేష మేమిటో కాని......అప్రయత్నంగా, అకస్మాత్తుగా తానంతట అదే మనముందు వచ్చిపడుతుంది.

కర—మనకు దాని అవసరం తీరి అక్కర లేనప్పుడు...

తహ—ఊహూఁ! అది కాదు. అప్రయత్నంగా దొరకడాన్ని గురించి చెబుతున్నాను.

కర—చిత్తం.

తహ—ఇదివరకు మూడునాల్గు నెలలక్రింద ఆవు ఎక్కడైనా దొరికితే తీసుకొందామని శతవిధాల ప్రయత్నం చేయించాను. కాని మనసుకు నచ్చింది

దొరికిందే కాదు—కరణంగారూ! ఆ కూర్చున్నగోవు ఎవరిదండీ? ఆపిల్లవా డెవరు దానిదగ్గర?

కర—చిత్తం! అదాఅండి! అది మన గ్రామాం దే! రెడ్డివెంకయ్యది. ఆకుర్రా డతనికొడుకు. పేరు సోముడు. ఒరేయ్! సోమిగా! ఇట్లా రా! తహశీల్దారుగారు పిలుస్తున్నారు.

తహ—వద్దు! వద్దు! వా డెందుకు కుర్ర కుంక...

కర—చిత్తం. వీడికీ, వీడి తలిదండ్రులకూ ఈ ఆవంటే మహాప్రేమండి! అందులో వీడి కా ఆవంటే ప్రాణం. ఎప్పుడూ దానిదగ్గరే వుండి సేవ చేస్తూ ఉంటాడు.

తహ—అట్లాగా! ఆవు చాలా అందంగా వుంది సుమండి...సరే మీ రింక వెనక్కు మళ్లండి మేం త్రిపురాంతకం వెళ్లాలి గాదు...దఫేదార్! గుర్రాన్ని ఇట్లా తెమ్మనూ...

కర—చిత్తం సెలవు...

అదుగో, తహశీల్దారుగారు గుర్ర మెక్కి త్రిపురాంతకం దోవ పుచ్చుకొన్నారు. కరణం మున సబులు, గ్రామజనులు వూళ్లోకి మళ్లారు...విన్నారా! తహశీల్దారుగారి ప్రసంగమంతా. ఆయావును పుచ్చు కునేలాగుంది. సరే! పదండి, మనమూ చెర్వుగట్టమీదుగా అటువేపునుంచి గ్రామంలోకి పోదాం.

౨

ఆమర్నాడు సాయంకాలం సుమారు ౫ గంట లకు కరణంగారు ఉదాహరించిన రెడ్డివెంకయ్య చెరువు కింది మళ్లు చూసి వద్దామనే వుద్దేశంతో బయల్దేరాడు. కొంతదూరం పోయినతర్వాత యల్లయ్య అనే మరో పెద్దమనిషి కలిశాడు. ఇద్దరూ మాట్లాడుకొంటూ పోయి చెరువుకట్ట ఎక్కి మళ్లకు అభిముఖంగా కూర్చొని వెంట దెచ్చుకొన్న జిల్లేడాకులతో చుట్టుకొన్న పొగ చుట్టలను ముట్టించి వార్తాలాపాలను ఆరంభించారు. అప్పుడు వారి కీవిధంగా సంభాషణ జరిగింది.

"యల్లన్నా! ఆఖరుకు ఎన్నాళ్లకు దయ వచ్చిందే మనమీద భగవంతుడికి!"

"ఏమోలే! అయిందీ అప్పుడే, ఇల్లలకంగానే పండగ?"

"ఇక్కడికి రెణ్ణెల్ల పైరైందా! ఇంకొక్కవాన కురిసి చెరువు నిండిందా అంటె చాలు. మననావ గట్టె క్కినట్లే...కాని కలెక్టేరు పెద్దదొర మన గ్రామా లన్నింటినీ తణిఖీ చేసి, మన మంచీ చెడ్డా విచారిస్తాడని కరణమయ్య ఎన్నాళ్లనుంచో అంటూ వచ్చినాడు కదా. ఇప్పటికీ రాలేదేమే? వాన కురవక ముందే వచ్చి వుంటే బాగుండేదిసుమా!"

"ఏం? ఎందుచేత?"

"వరసాన్ని మూడేళ్లు వానబొట్టు పడకపోగా పశువులు తిరగడంచేత దుమ్ములు రేగుతూవుండిన ఈ చెరువును, మళ్లగట్లన్నీ నేల చదరమై ఒకేమాదిరిగా నుండిన దీనికిందిపొలాలూ, కుటుంబాలకు కుటుంబాలు కడుపు చేత బట్టుకొని ఉత్తరాదిసీమలకు కూలి నాలి చేసుకోడానికి పోవడంచేత పాడుపడివుండిన మన గ్రా మాదులను కళ్లార చూస్తే అసలుసంగతి తెలిసివచ్చేదిగా దొరగారికి. ఇప్పుడంటే మళ్లీ కొంచెం పచ్చపడిం దాయె భూమి అంతా, వాన కురియడంచేత. వెనుకటిదీ ఇప్పటిదీ అంతా కలిపి అంటగడ్తారు ఇప్పుడు శిస్తునూ."

"వెంకన్నా! నీ వేకాలపు ముచ్చట్లో చెప్పు తున్నావు. పెద్దదొర వచ్చి చూడడంచేత మన కేమో ఒదుగుతుం దనుకోడం వట్టి ఆశ. దొర రాలేదేమో ఒకవిధంగా బ్రదికా మనుకో! మనకు బుద్ధి వచ్చిన కాణ్ణుంచి చూస్తున్నాం గామా. ఒక్క అమల్దారుడో, ఒక్క నీటిసూపరింటో లేక ఒక్క ఇన్స్పెక్టరో వస్తేనే మనప్రాణంమీదికి వస్తూఉంటుంది, వారికి సప్లయిలూ, సర్బరాలూ చేయలేక మన ఇంటిల్లిపాదికి రెండుమూణ్ణెల్లకు సరిపోయేగ్రాసం వారికి నాలుగైదు రోజులకే చెల్లు. మనకడుపులను కట్టుకొని, మన కన్న బిడ్డల నోళ్లను గట్టి, మనం ఊరక చూడడానికైనా

నోచుకోని అపరూపపుపదార్థాలను ఎన్నింటినో, ఎక్కడెక్కడనుంచో, ఎన్నితంటాలుపడో తీసుకొచ్చి వీరికి అరగింపపెడితే చిట్టచివరకు వెళ్లేనాటి కేముందీ! తిట్లు, శాపనార్థాలు, బెదరింపులు, ఈసడింపులనే ప్రసాదించి పోతూవుంటారు. ఈలాటి చిల్లరమల్లర అయ్యావార్ల నందరినీ వెంటేసుకొని పెద్దదొర వచ్చాడంటే, చచ్చామే వారికి సప్లయిచేయలేక."

"అవన్నీ నాకూ తెలుసు. కాని మూడేండ్లు వరసాగా చినుకు లేక మనం పడుతూవున్న బాధలనూ, మన మొగాలనూ, మనకొంపలనూ చూస్తే మన సేమన్నా కరుగుతుందేమో అని అధికారికి. వారుమాత్రం మనుష్యులు కామా?"

"మనుష్యులే కాని అధికారకవచం తొడుక్కోగానే మనుష్యత్వం దానంతట అదే మాయమౌతుందో లేక బలవంతంగా దాని విడవ్వలసివస్తుందో తెలియదు కాని మొత్తంమీద కనుపించదు. ఎంతకఠినపదార్థాలనైనా కరిగించడానికి సాధనాలను కనిపెట్టారు వైజ్ఞానికులు కాని అధికారిహృత్పదార్థం కరిగేలాగు చేసే సాధనం వీరికీ దొరికింది కాదు. వీరిచిత్తవృత్తికి దయకు అన్యోన్యాభావసంబంధం. అంటే అధికారిచిత్త మున్నచోట దయ ఉండదు. దయ ఉన్నచోట ఆధిత్యానికి చోటుండదు. మరోమాట. ఎవరికడుపాత్రానికి వారు తంటాలుపడుతూవున్నపుడు ఒకరిమీద ఒకరికి అనురాగం కలగడం అసంభవం. ఏదో విధంగా మనదగ్గర నుంచి లాగితేనే కాని వీరికడుపు నిండదు. అందునిమిత్తం ఇంకో ఆధార మేమైనా ఉంటేకదా! మనదగ్గరనుంచి రాకపోతే రంజాక్ ఆచరింపవలసిందే. గ్రామగ్రామాంతరాల్లో వుండే మనబోటిరైతులనుండి దీసిన రసాదానం చేతనే మదరాస్, బొంబాయి, కలకత్తాలవంటి విశాల నగరాల్లో వుండే గొప్పగొప్పయధికారు లనే మహామహీరుహా లన్నీ రోజుకు ఒకవిధంగా చిగిరిస్తూ పూలతో పిందెలతో కలకల్లాడుతూవుంటాయి. అచరాలవల్ల రసదాతలకు ప్రత్యుపకారమైనా కలుగుతుంది. కాని చరాలవల్ల అదీ పూజ్యమే. సరే, అది అట్లా ఉండనీ! ఏదో వాళ్లు పూర్వజన్మంలో పెట్టిపుట్టారు. ఇప్పు డను భవిస్తున్నారు. మన కారాత లేదు...సప్లయిలూ వగైరాలు పుష్కలంగా జరుగుతాయో జరగవో అనేభయం చేత మనగ్రామాల్లాటి క్షుద్రగ్రామాలకు రానే రారు కలకటేరువంటి పెద్దదొర్లు; మోతుబరీగ్రామాలకే పోతూవుంటారు. కాని తహశీల్ దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ల తాకీదులప్రకారం కరణంమునసబులు మన్ దగ్గిరనుంచి కూడా పోగుచేస్తూనేవుంటారు ఆసప్లయిల్లోని కొన్ని భాగాలను. ఒకవేళ దారిదప్పి వస్తాడే అనుకో పెద్దదొర మనగ్రామాలకు. వస్తే మాత్రం మనతో మాట్లాడుతారా? అసలు మాట్లాడడం ఏలాగు? మన మాట వారికి తెలియదు. వారిది మనకూ తెలియదు. అమల్దారుడే మునసబ్ కరణాలను అడిగి తెలుసుకొని దాన్ని దొరగారికి ఎట్లా మనవిచేసుకోవాలో అట్లా వినిపిస్తే వారు సమస్తం రామరాజ్యంలాగు సుభిక్షంగా ఉందని వ్రాసుకోమని వారిగుమాస్తాకు చెబుతారు. ఆయన దొర చెప్పిన మాటలను మరింత తీర్చి దిద్ది రికార్డులో ఎక్కిస్తూవుంటాడు. వీటి నన్నింటిని పోగుజేసి రాజ్యమంతా సౌఖ్యసంపత్తులతో తులతూగుచున్నట్లు దొరతనమువారు ప్రకటిస్తూవుంటారు. కాబట్టి అసలు కష్టాలు అనుభవించేవాళ్లకు తప్ప ఇంకోరికి తెలియవు."

"అయితే మనగతి ఇక ఇట్లా తెల్లవారవలసిందే."

"కాకపోతే ఇంకేమౌతుం దనుకొన్నావ్? అంచేతనే కదూ ౧౫, ౨౦ ఏళ్లక్రిందట పాడిపంటలతో, పచ్చనిసంసారాలతో, కలకల్లాడే మొగాలతో నిండివుండే మనగ్రామం ఇప్పుడు తుమ్మ, జిల్లేడు, వెంపలి, తంగేడు, నాగజెముడు దుబ్బుల పొదుదిబ్బలతో నిండి చీకటి పడితే బయటికి పోవడానికే భయమనిపిస్తూవుంది. మనకు తెలిసినంత మేర చుట్టుపక్కల ఉన్న గ్రామాల కన్నింటికీ ఇట్లాటిసౌభాగ్యమే కామూపట్టింది. అది సరే కాని, నీ వీమధ్య ఇక్కడ కాపురం ఎత్తేసి ఏగుంటూరుకో, తెనాలికో పోవా లనుకొన్నావట! నిజమేనా?"

"నిజమే. ఏం చెయ్యను చెప్పూ మరి. మాఅయ్య దాటిపోయినకాణ్ణుంచి గ్రహచారం చుట్టుకొంది మా

కొంపకి. ఒకఏడు ఎరుకళోళ్ల దొంగతనం, ఇంకోఏడు కొంపలకు నిప్పంటుకోడం, ఆమరుసటిసంవత్సరం గొడ్లకు తెగుళ్లు. ఒకయేడు పోలేరమ్మ ఎత్తిపోతలు. ఇంకోఏడు అంకాళమ్మ గొంతుకోతలు. ప్రతిసంవత్సరం ఏదో ఒక ఉపద్రవం. ఏదో ఒక తంపి! ఎన్నింటికని తట్టుకోగలను యెల్లయ్యా! అదివరకు ఉండే కరువుకు తోడూ మూడేళ్లు వరసాగ్గా వర్షం లేకపొయ్యేసరికి ఉన్న కాస్తా కూస్తా ఊడ్చిపెట్టుకొని పోయింది. పంటలు పండి ఇంటికి గింజలు చేరాయా లేదా అనేవిచారణ లేదు. నేలను దున్నితే చాలు. పూరాశిస్తు ఇవ్వాలిసిందే అంటారు సర్కారువారు. ఆముందటేడు మళ్లీ నాగయ్యదగ్గర రొక్కం తీసుకొని శిస్తుబాధ తప్పించుకొన్నాను కాని దాన్ని మించిన అప్పుబాధ మీద పడ్డింది. అతగాడు అంతకు పూర్వం చేసిన అప్పును, కొత్తదాన్ని కలిపి వడ్డీకి వడ్డీ కట్టడం మొదలుపెట్టాడు. అసలుకు రెట్టింపు దాటింది అప్పు. గొడ్డుగోదా ఇంట్లోవి పోయినవి పోగా రెండరకలఎడ్లూ, మాగంగమ్మ ఆవు మిగిలేయి. వీటిని మేపడానికే తలప్రాణం తోకకు వస్తూఉండేది. నేనూ, మాయింటిదీ, మాపిల్లోడూ ఎంతైనా సహించుకొంటూ వచ్చాం కాని నోరు లేని వాటి మొహాలను చూడలేక పొయ్యాము. మేయడానికి ముం దొకగడ్డిపోచయినా లేక దిగాల మమ్మల్ని చూస్తూ నిల్చునేవి అవి. ఎటూ దారి తోచక ఒకకాడిఎడ్లను తెగనమ్మాను. కొనబోతే కొరివి, అమ్మబోతే అడివి గదా. అందులో కటికకరువూ. ఉన్నవాటినే పోగొట్టుకొందామని చూస్తూఉండే సమయంలో కొత్తవాటిని కొనే దెవరూ? మహాకష్టంమీద వాటిఅసలు ఖరీదులో సగంకంటె తక్కువడబ్బు చేతికి వచ్చింది. నాగయ్య అప్పు పోగా మిగిలిందాంతో గడ్డి కొన్నాను, ఎంతో ప్రయాసపడి. ఏట్లాగో గడుపుతున్నాం జీవనం. ఈయేడైనా దేము డనుగ్రహించాడంటే సరి. లేకపోతే తట్టా బుట్టా నెత్తి నేసికొని ఊరికి సొస్తి చెప్పాలిసిందే. ఇంతకూ ఒకకష్టకాలంలో మాగంగమ్మ మమ్మ. ప్రాణం రక్షించింది దానికడుపు చల్లంగా. మా సోమిగాడు దానికి ఎంతో ప్రేమతో సేవ చేస్తూవుంటాడు. నోరులేని పశువేకదా! ఏంజీవ మైతే నేం! యెల్లయ్యా! ఏజన్మపు సంబంధమో తెలియదు. వాడు గడ్డి వేస్తేనే కాని మేయదు. వాడు నీళ్లు పడితే కాని తాగదు. మావాడూ, దాన్ని చూస్తేనే కాని బువ్వ తినడు."...

వీళ్లిద్దరూ ఈప్రకారం మాట్లాడుతూ ఉండగా పోలీసుజవా నొకడు ముడివేముల వెట్టివాణ్ణి వెంట బెట్టుకొని చెరువువేపు రావడం మొదలెట్టాడు. చెరువుమరిగొమ్మకు దక్షిణంగా పోయిన బాటగుండా త్రిపురాంతకానికి పోతా రనుకొన్నారు వీళ్లు. కాని వా ళ్లామార్గాన్ని వదలి తిన్నగా తాము కూర్చున్నవేపుకే వస్తున్నారు. దగ్గిరికి రాగానే వీళ్లిద్దరూ లేచి నిల్చున్నారు. పోలీసును జూచి వీళ్లకు కొంచెం తందరకూడా కలిగింది. ఘటనాఘటనసమర్థుడనీ, సర్వవ్యాపి అనీ, సర్వశక్తిమంతు డనీ పరమేశ్వరుడికి ఉండేవి బిరుదులు. కాని రూపంలేని ఈశ్వరుడివల్ల మన కీగుణత్రయంయొక్క సాక్షాద్దర్శనం లభించేది కాదు. క్రైస్తవశక ఊనవింశతి, వింశతిశతాబ్దాల్లో మనభాగ్యం పండబట్టి, ఉపర్యుక్త గుణత్రయపు ప్రత్యక్షదర్శనం మనకు చేకూరింది. ఏప్రకార మంటారా? రూపసహితమైన పోలీసుజాతిమూలాన్ని. రజ్జుసర్పభ్రాంతిలాగు దూరాన్నుంచి ఏదో ఎఱ్ఱతలగుడ్డ కంట బడితే చాలు. భయకంపాలు ఆవేశిస్తూవుంటాయి చూపరులను. అట్లాంటప్పుడు, పాపం, వీరు గ్రామీణులు; విద్యావిహీనులు. విద్యావంతులైతే మాత్రం! వాళ్లతరమా ఘటనాఘటనసమర్థఇత్యాదిగుణత్రయవిశిష్టరక్షకభటవర్గాన్ని ఎదురించడానికీ? సరే! ఇంతలో సర్కారునౌకర్లు వీరిదగ్గరకు వచ్చి ఆగారు. వెట్టివాడు వెంకయ్యను పోలీసువానికి చూపిస్తూ,

"అదుగో—ఆయనే వెంకయ్య" అన్నాడు.

"వెంకయ్యా—మీకోసం ఎంతసేపట్నుంచో వెదుకుతున్నాము. కరణంగారిమాటమీద మీయింటికెళ్లితే చెరువుక్రిందికి వచ్చినట్లు తెలిసింది. వెతుక్కొంటూ వచ్చాం."

"ఎందుకనీ?"

"తహశీల్‌దారుగారు మిమ్మల్ని వెంటబెట్టుకొని రమ్మన్నారు."

పోలీసునోటివెంట "మీ", "మిమ్మల్ని" అని గౌరవనీయమైన మాటలు వచ్చేసరికి వెంకయ్యకు రవంత భయం తగ్గింది. వెంటనే,—

"నన్నా? ఎక్కడున్నారు? ఎందుకు?"

"మిమ్మల్నే! త్రిపురాంతకంమకాంలో! ఎందుకు పిలిపించినదీ నాకు తెలియదు. అక్కడికి వెళ్లితే అన్నీ తెలుస్తాయి."

అందుమీద ఈసమాచారం ఇంట్లో చెప్పమని యెల్లయ్యను నియోగించి, 'సరే పదండి' అని వెంకయ్య పోలీసువానితో త్రిపురాంతకంమార్గం పట్టాడు. వెట్టివాడూ, యెల్లయ్య వూళ్లోకి మళ్లారు.

3

త్రిపురాంతకానికి పోతూ దారిపొడుగునా వెంకయ్యమనస్సు పరిపరివిధాల పోయింది. తహశీల్‌దారుగా రెందుకు పిలిపించివుంటారో యని చాలా దూరం ఆలోచించినా సమాధానం దొరికింది కాదు. బాకీపడివున్న శిస్తునుగురించి అదివరకే ఫైసలా తెలిసిపోయింది. పొలాలు పండినా ఎండినా ప్రభుత్వపు యంత్రం నడుస్తూవుండవలసిందే కాబట్టి, బొత్తిగా పండని సంవత్సరపుశిస్తు సగమాత్రం చెల్లించవలసిందని వచ్చిన సర్కారుపుత్తరవుప్రకారం ఇతడు బాకీపడివున్న వెనుకటిఏటి పన్ను ఈసంవత్సరపుశిస్తుతో కలిపి ధాన్యపు నూర్పిళ్లయినపిదప చెల్లింపవలెనని హుకుం ఇదివరకే జారీఅయివున్నందున ఇప్పుడావిషయమై ఏమీ అయివుండదు. ఇం కెందుకు మరీ పిలిపించింది? పోలీసు జవాన్ను అడిగి తెలుసుకోవలె ననుకొన్నాడు కాని నిజాని కాసంగతి అతనికి తెలియదు. దెబ్బ తగిలిన వాడికి మళ్లీ ఎక్కడ తగులుతుందో అని భయమే కావున మరల తనమీద ఏమి రానున్నదో అని తహతహపడుచు తన్నూ తనవాళ్లనీ రక్షించమని తన ఇష్టదేవతలనూ, దొనకొండ గంగమ్మనూ, వినుకొండ అంకాళమ్మనూ మొక్కుకొంటూ అతనివెంట నడిచిపోతున్నాడు. తుదకు వీరిద్దరూ త్రిపురాంతకం చేరేటప్పటికి రాత్రి ఎనిమిది గంటలు దాటిపోయివుంటుంది. తహశీల్‌దారుగారు అప్పుడే భోంచేసి కాంపుడేరాముందున్న మైదానంలో ఒక ఆరాంకుర్చీమీద కూచొని మర్నాడు సర్క్యూటు పోవలసినగ్రామాలనుగురించీ, అక్కడ చేయవలసిన, విచారింపవలసిన విషయములగురించీ గుమాస్తాతో మాట్లాడుతూవున్నారు. వీ రంతకు ముందే చెప్పివుండడంచేత వెంకయ్య రాగానే అక్కడున్నవాళ్లందరూ ఇతనిని ఒకవేపునకు పిలుచుకొనిపోయి తహశీల్‌దారుగారు ఎందుకు పిలిపించిందీ తెలియజేశారు. శ్రీవారు తమ ఆవును 'గంగ'ను కోరివున్నారని తెలియగానే ఇతనిమనసులో ఒకవిధమైన వ్యాకులం కలిగింది. ఇవ్వనంటే అధికారికి కోపం. ఇస్తానంటే ఇంట్లో చిక్కు. ఇంట్లో చిక్కుమాట గాని దానిని ఇవ్వడానికి అసలు ఇతనికే ఇష్టం లేదు. పశువు లెన్నో వస్తుంటాయి, పోతూవుంటాయి. ఇవ్వాళ వున్నవి రేపుండవు. రేపటివి ఎల్లుండి వుండవు. ఈరోజు పశువులసంతలో నూరురూపాయలు పోసి ఒకదాన్ని కొంటాం. రేపు మరోపదిరూపాయిలు లాభం చూసుకొని అమ్మేస్తుంటాం. పాలిచ్చినన్నాళ్లూ దూడలనోళ్లు కూడా కట్టి మొదలంటా పితుక్కొని తాగి, ఎండిపోవడంతోనే ఇంకొకరికి తోలిపెడతాము. కొంచెం ముసలిదౌతూవుందని కనుపడగానే ఏ కసాయివాడికో అంటగట్టి వచ్చినమట్టుకు ధనం రాబట్టుకొంటాం. అట్టివిషయంలో ఎందుకు దీనిపై ఇంతవ్యామోహ మంటారేమో! వినండి! ఏదరిద్రపు పిశినిగొట్టుమూర్ఖులో గాని, దయాదాక్షిణ్యాలు కల సజ్జను లెవరూ పశువులయెడల ఇంత నిర్మోహులై, ఇంత కఠినులై, ఇంత లజ్జాశూన్యులై, ఇంత రాక్షసులై వర్తింపరు. పశువులను బిడ్డలతో సమానంగా పోషించిన వాళ్లు, పాలిచ్చేవాటిని, అందులో ముఖ్యంగా ఆవులను, తల్లులవలె ఆదరించి కాపాడేవాళ్లు వాటికి సమస్తవిధములైన సేవలను చేసేవాళ్లు ఎంతమందో వున్నారు. అవన్నీ అట్లా వుండగా, ఈయావు అతనిఇంట్లోనే పుట్టి అక్కడే పెద్దదయింది. అది జన్మించినరోజుల్లోనే

ఆగ్రామంలో పశువులకు తెగుళ్లు తగిలి అందులో దీని తల్లికూడా చనిపోయింది. అది మొదలుకొని ఇతనూ, ఇతనిభార్య వెంకమ్మ దీనిని అనిర్వాచ్యమైన అనురాగం తో తల్లి లేనిబిడ్డనులాగే పోషించి పెంచి పెద్దదాన్ని చేశారు. దానికీ వీళ్ల మీద అటువంటిప్రేమే. వీళ్లిద్దరికీ ఏకపుత్రుడు సోముడికి ఈయావంటే ప్రాణం. పశువైతే ఏం? ఏప్రాణి అయితే ఏం? నిరంతరసహవాసంవల్లా, పెంచి పాలించడంవల్లా ఒకవిధమైన మమకారం ఏర్పడుతుంది పరస్పరం ప్రాణులకు. అందువలన ఈయావును ఇవ్వడానికి ఇతనికి మనస్కరించింది కాదు. ఆవిషయమై తెలియగానే మొగం చిన్నబుచ్చుకొన్నాడితను. ఏమి చెప్పడానికీ నోరాడింది కాదు. అక్కడున్నవాళ్లంతా ఇష్టం వచ్చినలాగు సలహాల నిచ్చారు. వాటిన్నిటి సారాంశం ఆవును శ్రీవారికి ఇయ్యవలసిన దనే. కాని ఇతడు సమ్మతించలేదు. అంత వారితనిసమాచారం శ్రీవారికి దెలియజేయగా వారితనిని ఎదుటికి పిలిపించి, "వెంకయ్యా! నే నా ఆవును పుణ్యానికి తీసుకో నెంచలేదు సరిగదా, ఏదో నాకు తోచింది నీచేతిలో పెట్టి సాగనంపుదామని కూడా కాదు; మధ్యవర్తు లెంత చెబితే అంత ఇస్తాను. ఒక వేళ నేనే మధ్యవర్తుల ఏర్పరచేయెడల వాళ్లు నా కనుకూలంగా చెప్పవచ్చును కాబట్టి నీవే నల్గురు పెద్దమనుష్యులను ఏర్పరచుకో. వాళ్లు న్యాయంగా దాని కెంత ఖరీదు ఇవ్వవచ్చునంటే అంత ఇస్తాను. పైగా నీకు ఈనాంకూడా ముట్టచెబుతాను. బాగా అలోచించుకో" అన్నారు. అందుమీద నితడు చేతులు జోడించుకొని ప్రార్థనాపూర్వకంగా, "రక్షించాలి ఏలినవారు! దాన్నసలు నేను అమ్మ తలుచుకోలేదు" అని అన్నాడు. అప్పూడాప్రక్కన వున్న వారిగుమాస్తా ముందుకు వచ్చి,

"వెంకయ్యా! వారికి దాంతో అవసరం వుందని తెలియంగానే నీయంతట నీవే దాన్ని తోలుకొని వచ్చి వారికి వప్పగించి పోవడానికి బదులు నిన్ను స్వయంగా పిలిపించి వారంతటివారు నీకింతగా చెబుతూవున్నప్పటికీ నీ వేమేమో తటపటాయిస్తా వేమిటే? వారు నౌకర్లెవరినైనా రవంత హెచ్చరించారా అంటే చాలు, ఎక్కడున్నా దాన్ని లాక్కొస్తారు ఒక్కగడియలో. కాని వారు కేవలం ధర్మస్వరూపులు. వారు తమకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసుకొనేవారు కారు. నీ ఇష్టమిమ్మదే నీ చేతిమీదుగా నీవే ఇస్తే తీసుకొందామని వారు నిన్ను పిలిపించారు మరోలాగైతే ఆవునే తెప్పించుకొని నీకు ఖరీదు పంపేవారు. బాగా యోచించుకో! వారిమాట తీసెయ్యకూ" అని అన్నాడు.

"నా మనవిని ఆలకించి నన్ను కాపాడండి. పెద్దోళ్లం మే మెట్లాగైనా సరిపెట్టుకొంటాం. మాకుర్రవెధవ దాన్ని విడిచి ఒక్కనాడైనా ఉండలేదు. అన్నందివక ప్రాణాలు విడుస్తాడు. వాణ్ణి రక్షించండి!" అని దీనంగా వేడుకొన్నాడు ఇతను.

"నీవే బొత్తిగా పిల్లవాడైపోతున్నావు. మీవాడేమిటి? కుర్రవెధవ ఆవుకోసం పస్తు ఉండడ మేమిటి? నాకు ఆశ్చర్యంగా ఉంది" అని మరో పెద్దమనిషి అందుకున్నాడు.

"ఆశ్చరం లేదు. నేను పిల్లవాడిలాగు మాట్లాడడమూ లేదు. సంగతి సందర్భాలన్ని తెలిసినవాణ్ణి కాబట్టి మొరపెట్టుకొంటున్నాను. మావాడూ అదీ ఒకరి నొకరు విడిచి వుండలేదు, అదేజన్మసంస్కారమో!"

"నీమాటలు వింటూవుంటే నాకు నవ్వు వస్తూ ఉంది. ఏజన్మంలోనైనా వాడూ, అదీ మొగుడూ పెండ్లాం కారుకదా?" అని ఎగతాళిగా నవ్వుతూ అన్నాడు గుమస్తా.

"ప్రభువు లేమన్నా సరి వస్తుంది. నే నేమని జవా బియ్యగలను? ఏజన్మలోనో తల్లి కొడుకు లెందుకు కాగూడదనూ" అని నెమ్మదిగా బదులిచ్చినాడు వెంకయ్య.

"సింగినాదేం కాగూడదనూ! వాడికంటె నీపట్టే ఎక్కువలాగుందే" అని గుమాస్తా వెంకయ్యను అధికారంతో చూస్తూ,

"నాలుగుడబ్బు లావెధవచేతిలో పడేస్తే వాడూరుకోడూ? ఈమాత్రానికి నీ వేమో మహా కిందుమీ

దయ్యేమాటలన్నీ మాట్లాడుతున్నావు” అని మరింత నిష్ఠూరంగా అన్నాడు.

“దయ వుంచండి, అయ్యా! నే మనవిచేసుకునే వన్నీ బూటకపుమాటలు కావు. కడచిన మూడు నాలుగేండ్లలోపల దాన్ని అమ్మివేయతగిన అవసరాలు ఎన్నిమార్లో వచ్చాయి. కాని ఆపని జరుగనియ్యలేదు. మేం పడుతూవుండిన మహాదురవస్థను జూచి ఇరుగుపొరుగువాళ్లెన్నితడవలో దాన్ని పోగొట్టుమని చెప్పారు. కాని దానిని అమ్మదలచుకొంటేనే మా కెట్లాగో వుండేది. మాకు తినడాని కేమీ దొరకని పాడు రోజుల్లో పస్తుపడుకొన్నాం గాని దాన్ని ఒకరికి ఇయ్యలేదు. అనుగ్రహించండి! అయ్యా! నామనవిని ఆలకించండి” అని మహాదీనంగా వేడుకొన్నాడు ఇతను. అంతనప్పుడు తహశీల్దారుగారు కొంచెం చిడిముడిపాటుతో, “సరే! ఇత న్నవతలికి తీసుకొని వెళ్లండి” అని అక్కడున్నవారితో చెప్పి, యథాపూర్వం తమ సర్కీటు విషయమై పరామర్శించడం మొదలుపెట్టారు గుమాస్తాతో. నౌకర్లూ, చాకర్లూ, అక్కడ వుండడం తటస్థించిన కొందరు పెద్దమనుష్యులు వెంకయ్యను ఈవలికి పిలుచుకొని వచ్చి తలా ఒకవిధంగా ఇతన్ని ఒప్పించాలినని ప్రయత్నం చేశారు. కాని సాధ్యం కాలేదు. ఈప్రకారం వీ రిక్కడ ప్రసంగిస్తూ వుండగానే రాత్రి చాలాపొద్దు మీరిపోయింది. శ్రీవారు గుమాస్తాతో సంభాషణం చాలించి డేరాలోకి పోయి శయనించారు కొంతసేపటి కాకాంప్ అంతా నిశ్శబ్దమై పోయింది. వైయక్తిక చ్ఛేదాలన్నీ తురీయావస్థలో ఏకీభవించి ఆనంద మనుభవిస్తూవున్నాయి. కాని వ్యక్తిత్వం బాపుకోలేక ఆరాత్రంతా ఒకమూల జాగ్రదవస్థలోనే గడిపింది వెంకయ్య జీవాత్మ ఒక్కటే.

౪

అత్యంత ప్రాచీనకాలాన్నుంచీ భారత వర్షం స్వామిభక్తికి ప్రసిద్ధి కెక్కినదేశం. తమకు ప్రియతమాలైనవాటిని, ధనధాన్యరాసులనూ, ఐహికసర్వస్వంనూ, తుదకు ప్రాణాలనుసైతం సమర్పించి స్వామికార్యాలను నెరవేర్చే నిఃస్వార్థశిరోమణులు, పరాక్రమవంతులు, శూరవీరులు, మేధావులు నైనపురుషపుంగవు లీభారత భూమిని అలంకరిస్తూవచ్చారు. సరే! ఇప్పుడో! ఇప్పుడు మాత్రం మనదేశం వట్టిపోయిం దనుకొన్నారా ఏమిటి? నేడు పూర్వకాలంకంటే వేయిమడుగు లెక్కువ సంప్రవర్ధమానమై, సందీప్యమానమై, ఖండ ఖండాంతరవాసుల చేతనే కాక ఖగోళవాసులచే గూడ జేగీయమానమై, మనుష్యమాత్రులకు ఆశ్చర్యదాయకమై, అనుపమానమై, అనేకప్రవాహాలరూపంగా ఈస్వామిభక్తి మనదేశంలో తాండవమాడుతూ ఉండడం, అధోగతిపాలై, నిర్భాగ్యులమై ఉన్న మన ఏ జన్మ జన్మాంతరసంచిత పుణ్యప్రతాపంచేతనో అయివుంటుంది గాని మరోటి కాదు. ఈకాలంలో స్వామిభక్తికి అధిష్ఠానభూతాలు చాలా ఉన్నాయి. కాని ముఖ్యాధిష్ఠానభూతం రక్షకభటవర్గం. ఈవర్గానికి జెందిన మనభ్రాతృవరులు చూపిస్తూ ఉన్న స్వామిభక్తినిగూర్చి వ్రాయాలనంటే కలానికీ సాధ్యం కాదు, చెప్పాలినంటే నోటికీ సాధ్యం కాదు. జాతికులాభిమానాలకు నీళ్లు వదలుకోవలసి వస్తుంది ఒక్కొక్కప్పుడు, ఈస్వామిభక్తిని ప్రదర్శించుకొనవలసినసంకట సమయంలో. పాప మీవర్గీయు లందులకు వెనుదీయరు. లజ్జావమాన పరిహాసాలకు తలలు వంచవలసివస్తుంది: వెనుదీయరు. మిత్రులను, దూరపుబంధువులనే కాదు, సన్నిహిత పితృమాతృపుత్రకళత్రాదులనుగూడ త్యజించవలసి వస్తుంది: వెనుదీయరు. ఓహో! ఏమి ఔదార్యం, ఏం త్యాగం! ఈ మహాపురుషులు ప్రకటిస్తూ వున్న స్వామిభక్తి సువర్ణకుంచికలతో, స్వర్ణద్రవముతో, సువర్ణఫలకాలమీద చిత్రింపదగినది. చూచి ఆమోదింపతగినది. విని ఆనందింపతగినది, ఆశ్చర్యపడతగింది. దూరదృష్టిలేని స్వార్థపరాయణులు కొంద రిట్టిస్వామిభక్తివలన అనర్థాలు కలుగుతా యంటారేమో! కలగనియ్యండి. అట్టి భక్తిదేవతముందు ఇట్టివాటి నన్నింటిని బలి ఇవ్వవలసిందే. ఎంతటిఅనర్థాలు కలిగినప్పటికి స్వామిభక్తుడు వాటిని లేశమాత్రం లక్ష్యం చేయకూడదు.

స్వామిభక్తి సంపన్నుడికి—పీడికడుపుచల్లగా—ఎప్పుడూ ఒకటే యావ. ఏవిధంగా స్వామికార్యం

సానుకూలం అవుతుందా అని అహర్నిశాలూ ఆలోచిస్తూనే ఉంటాడు స్వామిభక్తుడు. త్రికాలావస్థలయందూ ఇతని కిదే చింత ; అది నెరవేరేవరకు అతనికి అన్నపానాలుకూడా సరిపడవు. స్వార్థసిద్ధికి స్వామి ఒక ఉపాయం కనిపెట్టకలిగితే కష్టంమీద స్వామిభక్తుడు వెయ్యి ఉపాయాలను కనిపెడుతాడు, అవలీలగా, అదే సమయంలో. తహసీల్దారు స్వయంగా అడిగినా, అక్కడున్న వారందరూ అనేకవిధాల చెప్పినా, వెంకయ్య ఆవును ఇయ్యడానికి వప్పుకొనకపోవడం చూచి ఏలాగైనా దాన్ని తోలుకొని వచ్చి శ్రీవారికి వప్పగించి వారిచేత సత్కారపూర్వకంగా సర్టిఫికేటును పొందాలి ననే ఒక దివ్యమైన ఆలోచన అక్కడ ఉన్న స్వామిభక్తిపరాయణుడైన త్రిపురాంతకపు పోలీసుసార్జెంటు తలలోకి దూరింది. ఇది తనచేతిలో ఉన్నపని కాబట్టి శ్రీవారికి గాని తక్కినవారికి గాని ఎరుకపరచడం, వాళ్ల సమ్మతిని పొందడం అనవసరం అనుకొన్నాడు. అది గాక; ఎవరికీ ఏమీ ఎరుక లేకుండా కార్యం సఫలంజేసి అందరినీ ఒక్కమారుగా చకితులుగా గావించాలని ఇతని అభిప్రాయం. కాబట్టి దీనిప్రస్తాపంగూడా తేలేదు ఇతరులదగ్గిర.

మర్నాడు తెల్లవారంగానే తహశీల్దారుగారు ఈవిషయమై ఎవరితోనూ ప్రసంగించలేదు. రాత్రి ఏర్పాటుచేసుకొన్నప్రకారం సర్కీటుపోవలసిన గ్రామాలకు బయుల్దేరి వెళ్లారు. వెళ్లుతూ గుమాస్తా మొదలగు సిబ్బందిని ఫలానిగ్రామంలో వచ్చి మకాం చేయవలసిందనీ, అక్కడనుంచి క్రమక్రమంగా దారిలో వున్న గ్రామాలను చూసుకొంటూ ఒక్కవారంలోపల మార్కాపురం పోయి కలెక్టరుగారితో కలియాలననీ చెప్పి వెళ్లారు.

స్వామిభక్త సార్జెంటని ఇంతపొడుగుపేరు తడవ తడవా వ్రాయడానికి నాకూ, చదవడానికి మీకూ కష్టంగానే వుంటుంది కాబట్టి దాన్లోని పొడిఅక్షరాలను మాత్రం తీసుకొని సాభసాఅని వాడుకొందాం ఇకనుంచి. తహశీల్దారుగారు వెళ్లిపోవడంతోటే మనసాభసా ఎవరితో ఏమీ చెప్పకుండా ముడివేములమార్గం పుచ్చుకొన్నాడు. ఆసంగతిని క్యాంపును ఎత్తివేయడపు పనుల్లో మునిగిఉన్నందున ఎవరూ కనిపెట్టారు కారు. మిగిలిన వాళ్లందరూ వెంకయ్యతో మళ్లీ చెప్పారు ఆవును శ్రీవారికి ఇయ్యడాన్ని గురించి. వారు చాలా సత్పురుషులనీ, వారిని ఆగ్రహపరచడం మంచిది కాదనీ, వారి ప్రాపుదల వుంటే ముందుకు చాల క్షేమకరమనీ, వారి మనస్సును సమాధానపరచి వారిచ్చే ద్రవ్యంతో మళ్లీ ఇంకోదాన్ని కొనుక్కోవచ్చునని తలాఒకవిధంగా ఇతనికి బోధించి చెప్పారు. ఇతడు మౌనభావం వహించి ఇంటికి బయల్దేరాడు. శ్రీవారి అనుచరు లందరూ క్యాంపు సామానును రెండు రెండెడ్లబళ్లమీద వేయించుకొని వారు చెప్పిపోయిన గ్రామానికి పయనమై వెళ్లారు.

ఇటువైపు సాభసా సగందూరం వచ్చేసరికి త్రిపురాంతకం వెట్టివాడు మాదిగ నర్సిగాడు ఎదురైనాడు. మళ్లీ ఇద్దరం కలిసి వద్దామని తనకు తోడుగా ఉండడానికి వాణ్ణికూడా వెనక్కు తిరగమన్నాడు సాభసా. రాజుగారి ఉత్తరువుకు, తుదకు యమధర్మరాజుగారి ఆజ్ఞకు తిరుగు ఉంటే ఉండవచ్చు కాని, పోలీసువాని హుకుంకు వెనకా ముందా డడం వుండదు. నర్సిగాడు కిమ్మనకుండా వెనక్కు మళ్లాడు. వీరిద్దరూ ముడివేముల వూరిబయట చేరేసరికి మూడునాళ్లు గడియల పొద్దెక్కింది. ప్రాణివర్గ మంతా స్వస్వకార్యాచరణంలో మునిగివుంది. గుండ్లకమ్మ ఒడ్డుమీది తోటల్లో కొందరూ, చెరువుక్రింది మళ్లల్లో కొందరూ కృషకులు వారివారిపనులను చేసుకొంటున్నారు. వారికి చద్దన్నం చల్లముంతలూ అందించడానికి గ్రామ్యవనితలు వేరువేరు బాటలగుండా నడిచి పోతున్నారు. కొన్ని పశువులు వూరిబయటికి చేరాయి ; మరికొన్ని వస్తున్నాయి. మనవెంకయ్యకొడుకు సోముడు కూడా వాడి ఈడు పిల్లకాయలతో వచ్చి గొడ్లను మేయడానికి తోలి కొంచెందూరంలో కూచోని వున్నాడు. తహశీల్దారుగా రానాడు ఆవును జూచి ప్రసంగించినపుడు సాభసా వెంటనే వుండినందున ఇప్పుడితనికి దాన్ని గుర్తించడానికి ఆలస్యం పట్టలేదు. ఇతన్ని చూడంగానే అక్కడ వున్న బాలకు లందరూ మరి కొంతదూరం వెనక్కు పోయి నిలుచోని చూస్తున్నారు.

ఇతడా ఆవును సమీపించి వెంకయ్యగారి ఆవు ఇదే కదా అని అక్కడవున్న ఒకపెద్దపిల్లవానిని అడిగి, వాడు అవు ననగానే దానిమెడలో వదలుగా చుట్టబడివున్న పలుపును విప్పి పట్టుకోమని నర్సిగాడితో చెప్పాడు. ఈమాట విన్నక్షణమందే సోముడికి భయవిషాదాలు కల్గాయి. ఎటూ తోచలేదు. తెల్లబోయినమొగంతో చూస్తూ నిలుచున్నాడు. నోటివెంట మాట వచ్చింది కాదు. నర్సిగాడు పలుపును పట్టుకోంగానే అనవసరంగా నాజోలి కెందుకు వస్తున్నారని ప్రశ్నిస్తూ ఉన్నట్లు ఆవు మొగం పైకెత్తి తనచుట్టూ ఉన్న వాళ్లను చూస్తూ నిలుచుంది. అప్పుడు సాభసా దీన్ని తహశీల్ దారుగారికోసం పట్టించుకొని పోతున్నానని అక్కడిగొలకులతో చెప్పి నర్సిగాడితో పదమన్నాడు త్రిపురాంతకందోవనూ. వాడు పలుపును లాగుతూ నడిపించుకొని పోతున్నాడు. పిల్లవాళ్లకు ఏమీ తోచక దిగులుపడి చూస్తున్నారు. ఆవు పదిగజాలదూరం పోయివుండవచ్చు. అంతవరకు లోలోపల ఎంత విలపిస్తున్నాడో తెలియదు కాని, తనఆవు ఆకొంచెందూరం పోవడంతోటే కెవ్వున కేకవేసి ఏడుస్తూ దానివెంట పడ్డాడు సోముడు. ఆవును వెనకాలనుంచి తోలుక పోతూవున్న సాభసా వీడు రావడం చూసి, "దగ్గిరికి వచ్చావంటే వీపు వాయగొడతా జాగ్రత్త" అని కసరికొట్టి, "పదరా నర్సిగా, తొందరగా" అన్నాడు. వాడు మరికొంచెం తొందరగా పోవడం మొదలెట్టాడు. సోముడు మరింత బిగ్గరగా ఏడుస్తూ ఆయేడుపులోనే మాగంగా అంటూ పలవరిస్తూ వెంట పోతూనేవున్నాడు. మరి ఇరవై బారలు కడచాయి. ఇంతవరకు నర్సిగాడు లాగుతూవుంటే, సాభసా వెనుక తోలుతూఉంటే ఆవు నెమ్మదిగా నడిచిపోతుంది. కాని ఆస్వల్పందూరం గడచినతరువాత దానిమొగం గంభీరమైంది. రోషం ఆవేశించింది. ఒక్క ఝట్క్కతో నర్సిగాడిచేతిలోని పలుపును వదిలించుకొని వెనక్కు పరుగెత్తికొని వచ్చి సోముడిముందు నిలుచుంది. దానివంటిమీద చేయి వేసి తడువుతూ సోముడు మరింత బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాడు. నర్సి సాభసాలు దానివెంటనే వెనక్కు చూకారు. కోపంతో సాభసా సోముడినెత్తిమీద ఒకచరపు చరిచాడు. దానితో వీడిఏడుపు మరింత ఎక్కువైంది. ఆచుట్టుప్రక్కల నిలుచున్న పిల్లకాయల్లో ఒకడిచేతిలో ఉన్న మరొకపలుపును లాక్కొని ఆవుమెడకు అంటగట్టి, చూడవచ్చిన ఒక పెద్దమనిషిని ఆరెండోపలుపును పట్టుకోమని ముగ్గురూ మరల ప్రయాణం సాగించారు. సోముడు మళ్లీ వెంటపడ్డాడు. మా గంగా, మా ఆవు—అయ్యో! అంటూ రోదనం చేస్తూ వెంట పోతున్నాడు. ఇంతలో పొలాలలోపల పనులు చేసుకొంటూవున్న కృషకులనేకులు ఈ గలభాను విని బయటికి వచ్చారు. జరుగుతూవున్న సమాచారం తెలుసుకొన్నారు కాని సాభసాను ఎదిరించడానికి ఒకడికీ గుండె నిబ్బరించింది కాదు. భయవ్యాకులాలతో చూస్తూ నిలుచున్నారు అంతమంది కూడా. ఆవు వెనక్కు లాగడం, సాభసా మనుష్యులు ముందుకు లాగడం. కష్టంతో నడిపించుకొని పోతున్నారు. కన్నీళ్లు ధారలుగా గారఁ సోముడు ఏడుస్తూ నడుస్తున్నాడు, వీరివెనుక, చాలాదూరంలో. ఒక్క ఫర్లాంగుదూరం పోయివుండవచ్చు; మరల ఒక్కఝూడింపుతో రెండుపట్లనూ విడిపించుకొని పరుగెత్తుకొని వచ్చి సోముడిదగ్గర నిలుచుంది గంగ. ఉగ్రుడైపోయినాడు సాభసా. అంగలు పంగలు వేసుకొంటూ పరుగెత్తుకొని వచ్చి అక్కడెవరినీ నిలుచోవద్దని చుట్టూ మూగినవాళ్లను తరుమగొట్టి, మరినలుగురు బలిష్ఠులైన రైతుల నేరుకొని, మరినాలుగు తాళ్లను తెప్పించి రెండుకొమ్ములకూ రెండు తాళ్లనూ, వెనుక రెండుకాళ్లకూ రెండుతాళ్లనూ గట్టించి, అదివరకున్న రెండుపలుపులుసమేతం ఒకవేపు ముగ్గురూ, రెండోప్రక్క ముగ్గురూ ఆతాళ్లను బట్టుకొని ముందుకు లాగుతూ ఉంటే, ఆవు ఇటూ, అటూ, వెనక్కూ, ముందుకూ, గింజుకొంటూవుంటే, మహా ప్రయత్నంతో నడిపించుకొనిపోవ మొదలెట్టారు. ఈతడవ గుంపును తరుమగొట్టడంలో సాభసాగారి బలమైన పాదప్రహారమొకటి సోముడితుంటిమీద పడింది. తొమ్మిదేళ్ల కుర్రవెధవ దానికే ప్రకారం తాళుకోగలడు. కింద పడి ఏడుస్తున్నాడు. కాని పునహా కట్టుదిట్టం చేసి తన

ఆవును లాక్కొని పోతూవుంటే లేచి కుంటుకుంటూ మళ్లీ వెంటపడ్డాడు, మాగంగా అంటూ ఆవురావురని ఏడుస్తూ. తుంటిమీద మంచి దెబ్బ తగిలినందున ఈపర్యాయం వీడికి వాళ్లను బాగా వెంబడించడానికి శక్తి లేకపోయింది. అటు గంగకూడా మహాఘోరంగా పెనుగులాడుతునే ఉంది కాని, దానికీ చప్పున సాధ్యమైంది కాదు యమదూతల్లాటి మనుష్యులపట్లనుండి తప్పించుకోడానికి. పాపం, సోముడికి చాల దూరమైపోయింది. చెట్లచాటున కనుపడడంకూడా లేదు. కాని వాడు అదేవిధంగా ఏడుస్తూ కుంటుకొంటూ పోతూనే వున్నాడు. వీడి వెంట వున్న కృషకులు కొందరు వెనక్కు మరలించుకొని పోవాలి అని చూశారు కాని వాడు మరలలేదు. మాగంగ అనే ఏడుపుతప్ప వాడినోటివెంట ఇంకొకమాట రావడంలేదు. అక్కడ వెనుకనుంచి ఎవరూ కనుపడనందున ముందుకు లాక్కొనిపోతూవున్న సాభసామనుష్యులు కొంచెం తాళ్లను సళ్లువదిలారేమో తెలియదు. ఆతరుణం గనిపెట్టి రంయ్యిమని గింజుకొని ముందుకు దూకి అసలు దారినుండి ప్రక్కకు చెంగలించి త్రుటికాలంలో వెనక్కు మళ్లి నాలుగుకాళ్ల గాలప్పతో వెనకవాళ్లకు చిక్కక, ముందువాళ్లకు దొరకక, ప్రక్కలనుండి వచ్చువాళ్లకు పట్టువడక కట్టుతాళ్లు తావుళ్ల చేత నేలమీది చిన్న చిన్న కంకరరాళ్లు, మొక్కలు ఎగసి చిందరవందరగా నలుదిక్కుల పడుతూవుంటే, పేరాలు దీసుకొంటూ మేఘాలమీద పారినలాగు వచ్చి సోముడిముందు వ్రాలింది గంగ. ఈతడవ సాభసా హిరణ్యకశిపుడైపోయినాడు. ఏమిటో! మేదకమైన ఆవుగదా, తోలుకొని వచ్చి తహశీల్ దారుగారికి వప్పగించి బిరుదు గొట్టవచ్చు ననుకొన్నాడు కాని, ఇంతటి మహా మొండిశిఖండి గడుసుదనపు పెంకె ముదరష్టపు పాసురుబోతుగొడ్డు దాపరిస్తే దానిమూలాన్ని ఇన్ని అగచాట్లు, ఇంత హైరాన్ పడవలసివస్తుందని కలలోనైనా అనుకోలే దితను. ఇక ఇంతవరకు వచ్చినతర్వాత ఊరికే పోనిస్తే నలుగురిలో తనది నవుబాట్లమారి బ్రతుకౌతుందని భయం, రోషం మితిమించిపోయిం దితనికి. ఒళ్లు పొంగిపోయింది. కళ్లెర్రబారాయి. పట్టుకొన్న వాళ్లను తెగదిట్టి వెంటనే మరల పట్టుకోడానికి వెనక్కు తరిమి తాను పరుగెత్తాడు. అంతదూరాన్నుంచే ఎవరికీ పట్టుపడకుండా పరుగెత్తుకొని వచ్చి సోముడిముందు ఆవు నిలుచుండడం చూశాడు. ఇన్నిసార్లు తంటాలుపెట్టినందుచేత సాభసాకే కాక తక్కినవాళ్లకు గూడా ఆగ్రహం వచ్చింది. ఈ తడవ పట్టుకొని ముక్కుకు తాడు పోసి కాళ్లకు బండకొయ్య వెయ్యాలనని నిశ్చయించుకొన్నారు. వీరిసామ్మేమో పోయినలాగు మహాధాటీగా పరుగెత్తుకొని వస్తున్నారు. పదిగజాలదూరంలోకి వచ్చారు. ఇంకొక్క దూకుడులో వచ్చి కట్టుతాళ్లను లంకించుకొంటారనగానే రెప్పపాటికాలంలో తోక ఝాడించి మెరుపు మెరిసినలాగు కుప్పించి ఎగసి ఎవరికీ పట్టుపడకుండా పశ్చిమోత్తరానికి పరుగెత్తింది గంగ. ఈ కుప్పించి యెగసిన వేగంలో ఎడంకాలికి కట్టివున్న తాడు ఆప్రక్కనుంచి పట్టుకోవలెనని వచ్చిన ఒక పెద్దమనిషికి ఛళ్లున దగిలి, తగిలినంతమేర వాతపడ్డట్టయింది. ఆవు మక్కలమీద ఎగిరి పోతూఉంది దొరక్కుండా. సాభసాకు వొళ్లంతా భగ్గున మండిపోయి, ముందూ వెనుకా ఏమీ తెలిసింది కాదు. అక్క డెవరిదగ్గరనుంచో ఒక చాంతాడును లాక్కొని, ఈ పాపిష్టిముండాకొడుకుమూలాన్ని కదా ఇంత మూడిందని సోముడిమీద పశి వీపు తాట ఊడేలాగు కొట్టాడు. దాంతో వాడు స్పృహ తప్పి క్రింద పడిపోగా, అప్పుడు వాణ్ణి వదలి మళ్లీ ఆవును వెంబడించడానికి పరుగెత్తా డితను, తనవాళ్లను వెంటేసుకొని. తర్వాత అక్కడ వుండడం తటస్థించిన మనుష్యు లందరూ సోముడిచుట్టూ చేరి భయశోకాలు ముప్పిరిగొన కళ్ల నీళ్లు పెట్టుకొంటూ వాడికి ఉపచరించడం మొదలెట్టారు. అటువంటిస్థితిలో చేరాడు అక్కడికి త్రిపురాంతకాన్నుంచి ఇంటికి బయలుదేరిన మన వెంకయ్య. దగ్గరున్నవాళ్లు జరిగిందంతా చెప్పారు. కొడుకును చూసేసరికి కళ్లకు అంధకారం కమ్మింది. ధారాపాతంగా బయలుదేరిన కన్నీళ్లను తుడుచుకొంటూ కొడుకును బుజంమీద వేసుకొని ఇంటికి బయలుదేరాడు.

౫

తెల్లవారినతర్వాత గొడ్లను తోలు కెళ్లడానికి ముందు ఇంత చద్దన్నం తిని ఇన్ని చల్లనీళ్లేం తాగేడో కాని. తక్కినదినమంతా కటికలంఘనం, పచ్చిగంగైనా తాగలేదు, సోముడు. ఎంత పల్లెటూరి మోటుకుంకైనా, ఇంకా లేతవళ్లే కదా పాపం! హూనహూనమైంది. వీపూ, ప్రక్కలూ తెగ కందాయి. పెక్కుచోట్ల నెత్తురు ఓడుతూవుంది. తుంటంతా వాచిపోయింది. తలపోటూ, దిమ్మ. చప్పున మందు మాకూ వేయించి కొంచెం ఉపశమనం కలిగించడానికి, ఈపాడు కొంపల్లో వైద్యుడా వల్లకాడా! లక్ష్మీసంపన్నులకు పెద్దపెద్ద పట్నాల్లో లెక్కలేని ఆస్పత్రులూ, లెక్కలేని వైద్యులూనూ; కాని అనాథులకూ, అనాథుల కొంపలకూ వైద్య లెక్కణ్ణుంచి? ఇటువంటి దేశహితసంస్థలన్నీ దరిద్రులకనే ఏర్పడుతూ వుంటాయి. అనాథులకు ధర్మాసుపత్రులనీ, బీదలకు ఉచితవైద్యాలయాలనీ, దరిద్రులకు యూనానీహాలులనీ ఎన్నో వెలుస్తూ ఉంటాయి. పైకి పేరెట్లా ఉన్నా, ఆపేరును నిలుపుకోడానికి దీనులకు రవంత సహాయపడుతూవున్నా, మొత్తంమీద ఈధర్మార్థ ఉచిత ఔషధాలయాల్లో ధనవంతులకే ఎక్కువ సౌకర్యాలూ, వైద్యాలూ జరుగుతూ వుంటాయి. భాగ్యహీనులకు ఎక్కడున్నా వకశే. ఇక ఈక్షుద్రగ్రామాల్లో గ్రామపరిసరాలే ఆస్పత్రులు, ప్రకృతిపరివర్తనమే మందు. భగవంతుడే వైద్యుడు. ఏదో ఈశ్వరానుగ్రహంవల్ల పుడుతుంటారు, పెరుగుతూ వుంటారు. పరిశుభ్రమైన ఆహారం, వాయుజలసేవనం వలన గ్రామీణులు సాధారణంగా ని రో గు లు గా నే వుంటారు. కాని ఈలాటి గలభాలూ, కొట్లాటలూ సంభవిస్తే, అందులో ఉపద్రవకరములైన గాయాలేమైనా తగిలితే, అటు మార్కాపురానికో, ఇటు వినుకొండకో తీసుకొని పోతూవుంటారు రోగిని, ఓనులకమంచంమీద వేసుకొని, నలుగురైదుగురు మోసుకొనీ. ఇప్పుడు వీణ్ణి మార్కాపురం తీసుకెళ్లడానికి తహశీల్ దార్ పోలీసుల భయం ఇంతవరకు అయింది కాక ఇంకా నెత్తిమీదికేం తెచ్చిపెడుతారో అనీ. సాధసా ఇంత ఆగడానికి కారణం గాని, తహశీల్ దారుకు ఈదారుణ కృత్యంలో జోక్యం ఎంతమాత్రం లేదని ఈయనాథులకు తెలియదు. కాబట్టి వాళ్లూ వీళ్లూ చెప్పిన చిల్లరమల్లర వేపాకువైద్యాలెన్నింటినో చేశారు. తుంటిని కాచి పట్టు వేసి, వీపూ ప్రక్క లంతటా కొబ్బరనూనె పూశారు. రెండుమూడు గంటలవరకు కుర్రవాడికి ఒంటిమీద స్పృహే లేదు. తరువాత కొంచెం తెలివి వచ్చింది మొదలుకొనీ 'అమ్మ! అయ్య!' అంటూ మూలుగుతూనే వున్నాడు. సాయంకాల మయ్యేటప్పటికి మహాప్రచండంగా జ్వరం పెట్టుకొచ్చింది. రాత్రి మీరినకొలదీ జ్వరం ఎక్కువౌతూ పోయింది. దేహమంతా కాలినపెనంలాగుంది. కొడుకును ఇంటికి దెచ్చింది మొదలుకొని తల్లి వాణ్ణి వదల్లేదు. ఆవేళ ఇంట్లో అన్నపానాలు లేవు సరికదా, వీళ్లదురవస్థకు జాలిపడి పక్కింటమ్మ ఇంత అన్నం నీళ్లూ తెచ్చి యిస్తే వీళ్లకు తాకడానికైనా బుద్ధిపోలేదు. తల్లి వాణ్ణి ఒళ్లో పెట్టుకొని మహాఘోరంగా ఏడుస్తూ ఉంది. "నాయనా! మాటాడవేం? తండ్రీ! నిండుపది నెలలు కడుపున భరించి నేలమీద పడిన దాది మొత్తని పొత్తిళ్లలో నిడి చమురు రాచి రాచి నే పెంచి పెద్దజేసిన శరీరమా ఇది! అయ్యో! ఎంత కమిలిపోయిందీ! వాడికి చేతు లెట్లాడాయి తండ్రీ, నిన్ను కొట్టడానికి. లేశమాత్రమైనా నీవు వారి కపరాధం చేయలేదే! వాడికి లేరా నీవంటి బిడ్డలు? నాయనా! పరుగెత్తైనా పరుగెత్తక తిన్నగా నిలుమానే తిన్నావూ దెబ్బ లన్నిటినీ. ఒక్కరైనా అడ్డపడడానికి రాలేదా?" అనిఘోరున ఏడుస్తుంది; నెత్తి రొమ్ము కొట్టుకొంటుంది; నేలమీద విసరుకొని పడుతుంది, లేస్తుంది. వాడిచేతు లెత్తి తనమీద వేసుకొంటుంది. ముద్దు పెట్టుకొంటుంది. కౌగిలించుకుంటుంది. నాకడుపులో చిచ్చుపడ్డదే అని వలవల ఏడుస్తుంది. రవంత ధైర్యంతెచ్చుకో అని వెంకయ్యా, దగ్గర ఉన్నవాళ్లూ ప్రయత్నిస్తారు. కాని ఆదుఃఖాన్ని ఆర్పడం వీళ్లతరమా! ఆమె విలాపం జూచి వీళ్లకే దుఃఖం పొంగి పొంగి వస్తూఉంది. ఆమెను ఊరడించబోతే వీరికి నోటివెంట ఏడుపే వచ్చేది. కుర్ర

వాడు జ్వరపుమమ్మరంచేత ఏమేమో వదరుతున్నాడు. ఆ యర్థంలేనిమాటలు వింటే తల్లికడుపు తరుక్కొనిపోతూఉంది. మరింత తలుచుకొని తలుచుకొని విలపిస్తుంది. రాత్రి రెండుమూడు గంటలు దాటుండవచ్చు. ఏడ్చి ఏడ్చి అలసి ప్రక్కను వ్రాలి వుంది వెంకమ్మ. హఠాత్తుగా పిల్లవాడు "అమ్మా" యనేసరికి ఉల్కిపడి లేచింది, 'ఏం నాయనా? ఏం తండ్రీ!' అంటూనూ. కుర్రవాడు కళ్లు తెరచి వెర్రిగా తల్లిని చూస్తూ, "అమ్మోవ్!...అదుగోనే మనగంగ... అదుగో...అదుగో...దా న్నెవరో పట్టుకపోతున్నా రమ్మా...గంగే...నావేపు చూస్తూంది...నన్నూ రమ్మంటుందే...అమ్మా! నేనుకూడా పోతా" నంటూనే కళ్లు మూసుకొన్నాడు. జ్వరం వచ్చినప్పటినుంచీ ఏదో అర్థం లేకుండా వదరడమే కాని కుర్రవా డిట్లా స్పష్టంగా మాట్లాడింది లేదు. ఇప్పుడు బాగా మాట్లాడడంచేత జ్వరం కొంచెం తిరుగుమొగ మైందనుకొంది పాపం, వెంకమ్మ. 'ఏం నాయనా! ఎట్లా ఉంది తండ్రీ' అని పలుకరించింది. నోట మాటా లేదు గీటా లేదు. కళ్లు, వొళ్లు, పళ్లు, బిగుసుకొని పోతున్నాయి. 'అయ్యో, నా తండ్రీ' అని నెత్తీ, రొమ్మూ మోదుకొంటూ కొడుకు మీద పడిపోయింది......

ఈశోకవార్త ఘటిల్లిన రెండుమూడురోజులకు ఎర్రగొండపాలెపు అడవిలో పెద్ద చిరుతగం డొకటి ఎక్కడిదానో ఆవును ఒకదాన్ని వేసుకొనిపోయిందని ఫారెస్టుగార్డు ముతరాసిపెద్ద కటారి కన్నయ్య దొర త్రిపురాంతకం వచ్చి చెప్పితే ఆసంగతిని ముడివేములవాళ్లు విని పదిపన్నెండుమంది ఆదొరను వెంటబెట్టుకొని పోయి ఆఅడవిలో వెదికారు. పరుసుఘాటిలో ఊడి కాని, తెగి కాని పోయినవి పోగా మిగిలి శిథిలములై పడివున్న తాళ్లను బట్టి అచట ఇటూ అటూ చెల్లాచెదరుగ పడిఉన్న పశుకళేబరావశేషములను గంగవే యని నిశ్చయించుకొని వచ్చారు.

ఏవిషయమైనా మితి మీరిపోయినపుడు పిరికిపందలకుగూడా ధైర్యం వస్తుంది. మితి మించినప్పుడు పిల్లికూడా తిరగబడుతుంది. గంధపుచెక్కసయితం తెగ అరగదీయడం మొదలిడితే శీతలచందనానికి బదులు అగ్నిని పుట్టిస్తుంది. ఇంటిదగ్గర సోముడి దుర్మరణం అడవిలో నిక్షేపంవంటి ఆవు పులివాత పడి చావడం వినేటప్పటికి ఆవూరివాళ్ల కందరికీ అరికాలుమంట నెత్తి కెక్కింది. అందరూ కట్టు కట్టి తక్షణం మార్కాపురం వెళ్లారు. తాలూకాసమాచారం యావత్తూ కనుక్కోడానికి వచ్చి అక్కడ దిగివున్న పెద్దకలెక్టరు ఎదుటికి నిర్భయంగా పోయి జరిగిన దారుణాత్యాచారం గూర్చి మొరపెట్టుకొన్నారు ఏకగ్రీవంగా. కలెక్టర్ యూరోపియన్ దొర. సాధారణంగా జాతిదొరల స్వభావం ఎట్లా ఉంటుందని తోస్తుందంటే, ఏవిషయాన్నిగురించి అయినా అందరూ కలసి ఒక్కపర్యాయంగా ఒక్కవిధంగా మొరపెట్టుకొన్నయెడల దాని కేదో ప్రతీకారం చేసితీరుతారు. కాని ఒకడో ఇద్దరో వస్తే వీరి కంతలక్ష్యం ఉండదు. గ్రామానికి గ్రామం ఏకమై వచ్చిందని దొరకు తెలియగానే, వెంటనే ఆ తహశీల్దారుకూ, ఆపోలీసుసార్జెంటుకూ, ఇంకా ఆ కేసుతో సంబంధం ఉండవచ్చునని తోచినవాళ్ల కందరకూ అర్జెంటునోటీసుల పంపి పిలిపించాడు.

రెండుమూడురోజులు అఖండవిచారణ జరిగింది. నిజం తేటపడింది. అనర్థాల కన్నింటికీ పోలీసుసార్జెంటే కారకుడని విస్పష్టమైంది. వెంటనే పొడుగుపాటి తీర్పు జడ్జిమెంటు వ్రాసి కోర్టులో వినిపించాడు. ఆతీర్పులోని అంతిమవాక్యాలే

"అధికారులు కొందరు తమ కిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం జేసి......" ఇత్యాదులు.

సాభసామీద కోప్పడేరు సుమీ! ఇకముందు ఇతఃడు వెంకయ్యకుటుంబానికి పరమాప్తుడౌతాడు. రాబోవుభాగంలో చూడండి.